క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో రథోత్సవం



రథాన్ని లాగుతున్న మాజీ ఎమ్మెల్యే, ఎంపీపీ

కొడంగల్: కేశవనగర్‌లో వెలిసిన శ్రీ రాఘవేంద్ర స్వామి ఆరాధనోత్సవాలు ఘనంగా జరిగాయి. శుక్రవారం ఉదయం స్వామి వారి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి, ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్ రథోత్సవంలో పాల్గొన్నారు. రథాన్ని ముందుకు లాగి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మహిళా భక్తులు రథం ఎదుట భజన కార్యక్రమాలు నిర్వహించారు. భక్తి పాటలతో అలరించారు. ఇందులో డీడీఎస్ జిల్లా అధ్యక్షుడు జయతీర్థాచారీ, సామాజిక కార్యకర్త మురహరి వశిష్ట, అర్చకుడు అక్కి శ్రీనివాస మూర్తి తదితరులు పాల్గొన్నారు.

వేపాకు అలంకారణలో రేణుకా ఎల్లమ్మ దర్శనం



తాండూరు: తాండూరు పట్టణం వ్యవసాయ మార్కెట్ యార్డులో వెలసిన రేణుకా ఎల్లమ్మ శుక్రవారం వేపాకుల అలంకారణలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రావణ శుక్రవారం సందర్భంగా అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఎంతో ఇష్టమైన వేపాకులతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.

ఇంటింటికీ బీఎస్పీ



మహిళలకు బొట్టు పెడుతున్న నర్మద కిష్టప్ప

కొడంగల్: నియోజకవర్గంలో బీఎస్పీ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించింది. శుక్రవారం కొడంగల్ మండలం అంగడిరాయిచూర్‌లో ఇంటింటికీ బీఎస్పీ.. గడపగడపకూ ఆర్ఎస్పీ అంటూ ప్రచారం ప్రారంభించారు. బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి నర్మద కిష్టప్ప ఆధ్వర్యంలో పార్టీని బలోపేతం చేయడానికి గ్రామాల్లో కమిటీలను నియమిస్తున్నట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో సచిన, బందెప్ప, పకీరప్ప తదితరులు పాల్గొన్నారు.

జేఎల్ఎంకు ఇద్దరు ఎంపిక

యాలాల: ట్రాన్స్‌కో శాఖలో జేఎల్ఎం(జూనియర్ లైన్‌మెన్) ఉద్యోగానికి మండలం నుంచి ఇద్దరు యువకులు ఎంపికయ్యారు. మూడు నెలల క్రితం జేఎల్ఎం ఉద్యోగానికి దౌలాపూర్ గ్రామానికి చెందిన డప్పు అంజిలయ్య, అగ్గనూరు గ్రామానికి చెందిన ఎం.నరేందర్‌లు అర్హత సాధించారు. కాగా మూడు నెలల పాటు ట్రాన్స్‌కో శాఖ తరపున నిర్వహించే వివిధ అర్హత పరీక్షల్లో వీరు ఉత్తీర్ణులు కాగా.. శుక్రవారం నిర్వహించిన తుది ఫలితాల్లో వీరిద్దరు అర్హత సాధించినట్లు ప్రకటించారు.

రైతులకు రుణ 'సహకారం'

- అన్నదాతకు అండగా మోత్కుర్ పీఏసీఎస్
- అవసరమైన వారికి సకాలంలో సాగు సాయం
- ఇప్పటికే రూ.50 లక్షలు అందజేత
- దీర్ఘకాలిక రుణాలకు రూ.3 కోట్లు మంజూరు



మోత్కుర్ ప్రాథమిక సహకార సంఘం

దోమ: వానాకాలం సీజన్‌లో రైతులకు రుణాలు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే రుణమాఫీని ప్రకటించి, మరింత మంది అన్నదాతలకు పంట పెట్టుబడికి సాయం అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. దోమ మండల కేంద్రం మోత్కుర్ ప్రాథమిక సహకార సంఘం రైతులకు ఏటా పంట రుణాలు అందిస్తూ అండగా నిలుస్తోంది. రుణాలతో పాటు అవసరమైన వారికి దీర్ఘకాలిక రుణాలను సైతం మంజూరు చేస్తూ రైతన్నకు వెన్నుదన్నుగా నిలుస్తోంది.

సభ్యులుగా 5,800వేల మంది

ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘం పరిధిలో మొత్తం 36 గ్రామ పంచాయతీలు ఉండగా.. అందులో 5,800 మంది రైతులు సభ్యులుగా ఉన్నారు. వీరికి ఏటా ప్రభుత్వం పంట పెట్టుబడి రుణాలను అందిస్తోంది. అవసరమైన రైతులకు దీర్ఘకాలిక రుణాలను ఇస్తోంది. ఇప్పటికే ఈ వానకాలం సీజన్‌లో పంట రుణాల కోసం రూ.50 లక్షలు ప్రభుత్వం అందజేసింది. రుణమాఫీ అయిన రైతులు తీసుకున్న రుణాల్లో మిగిలిన డబ్బును చెల్లించి, కొత్త రుణాలు పొందాలని పీఏసీఎస్ అధికారులు సూచిస్తున్నారు.

దీర్ఘకాలిక రుణాలు

రాష్ట్ర ప్రభుత్వం పీఏసీఎస్ ఆధ్వర్యంలో రైతులకు దీర్ఘకాలిక రుణాలను అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. మండల కేంద్రంలోని పీఏసీఎస్‌కు రూ.3కోట్లు దీర్ఘకాలిక రుణాలను మంజూరు చేసింది. ఈ దీర్ఘకాలిక రుణాలతో రైతులు గొర్లు, బర్రెలు, మేకలు, ట్రాక్టర్లు, వరికోత యంత్రాలు, భూమి చదును చేసే కల్టివేటర్లు, ఫౌల్ట్రీఫాం, పశువుల షెడ్లు, వ్యవసాయ పనిముట్లకు ఈ రుణాలను అందజేస్తున్నారు. ఇప్పటి వరకు పీఏసీఎస్ ద్వారా రూ.75 లక్షలకు పైగా రైతులకు రుణాలు అందజేశామని, అవసరమైన వారు వినియోగించుకోవాని అధికారులు కోరారు.

వేగంగా ధాన్యం కొనుగోళ్లు

రైతులు పండించిన ధాన్యాన్ని పీఏసీఎస్ ప్రతియేటా కొనుగోలు చేస్తోంది. గత వానకాలం, యాసంగి సీజన్లలో రైతులు పండించిన వరిని ప్రభుత్వం నిర్ణీత సమయంలో కొనుగోలు చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసింది. మండల కేంద్రంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో రైతులకు అందుబాటులో ఓ గోదాం నిర్మించగా, తాజాగా బొంపల్లిలో రూ.1.13కోట్లతో మరో నూతన గిడ్డంగిని నిర్మించి అన్నదాతలకు అందుబాటులోకి తెచ్చింది.

సేవలు బాగున్నాయి



ప్రాథమిక సహకార సంఘం సేవలు రైతులకు ఎంతో అనుకూలంగా ఉన్నాయి. సాగుకు పెట్టుబడి రుణాలను అందజేయగా, అవసరమైన రైతులకు దీర్ఘకాలిక రుణాలను అందిస్తూ అండగా నిలుస్తోంది. ఇచ్చిన రుణాలను రైతులు సకాలంలో చెల్లించగా.. మళ్లీ రుణాలు ఇస్తున్నారు. దీర్ఘకాలిక రుణాల కింద ఫౌల్ట్రీఫాం ఏర్పాటు చేసుకున్నాను.

– ముద్దం వెంకటయ్య యాదవ్, రైతు, బొంపల్లి

వినియోగించుకోవాలి



మోత్కుర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో రైతులకు అనేక సేవలను అందిస్తున్నాం. పంట రుణాలు ఇవ్వడంతో పాటు దీర్ఘకాలిక రుణాలను ఇస్తున్నాం. ఇప్పటికే పీఏసీఎస్ ద్వారా దీర్ఘకాలిక రుణాలను అందించాం. అవసరమున్న వారికి ఇస్తాం. సంఘంలో సభ్యత్వం కలిగి ఉన్న రైతులు రుణాలను సద్వినియోగం చేసుకోవాలి.

–దాతన్నగారి ప్రభాకర్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్

రైతు అభ్యున్నతికి కృషి



రైతుల అభ్యున్నతికి పీఏసీఎస్ ఎంతో కృషి చేస్తుంది. ఇందులో సభ్యత్వం ఉన్న రైతుకు రుణాలు ఇస్తున్నాం. ఇచ్చిన రుణాలను సకాలంలో చెల్లిస్తే మళ్లీ రుణాలు పొందేందుకు వీలుంటుంది. ఇప్పటికే దీర్ఘకాలిక రుణాలు రూ.75 లక్షలకు పైగా అందజేశాం. అవసరమైన రైతులు పీఏసీఎస్ సేవలను వినియోగించుకోవాలి.

– యాదగిరి, సీఈఓ, పీఏసీఎస్

మండల ఏర్పాటుకు డిమాండ్



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

దౌల్తాబాద్: గోకఫస్లాబాద్ గ్రామ పంచాయతీని మండలముగా ఏర్పాటు చేయాలని శుక్రవారం గోకఫస్లాబాద్, పోల్కంపల్లి గ్రామస్తులు తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. ముందుగా గోకఫస్లాబాద్ గ్రామం నుంచి బైక్ ర్యాలీతో మండల కేంద్రానికి చేరుకొని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయం చేరుకొని గోకఫస్లాబాద్ జీపీని మండలంగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. తహసీల్దార్ విజయకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అఖిలపక్షం నాయకులు రెడ్డి శ్రీనివాస్, భీంరెడ్డి, మధుసూదన్, సతీష్ ఉన్నారు.

ఆర్థిక సహాయం

కుల్కచర్ల: కుల్కచర్ల మండలం కామునిపల్లి గ్రామానికి చెందిన చాగంటి రాములమ్మ మృతిచెందారు. స్థానిక నేతల ద్వారా విషయం తెలుసుకున్న డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్ రెడ్డి.. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆంజనేయులు తదితర నేతల ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి తక్షణ సహాయంగా రూ.5వేలు అందజేశారు. ఇందులో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, యువజన విభాగం అధ్యక్షుడు జంగయ్య ఉన్నారు.

గ్యాస్ ధర తగ్గింపుపై హర్షం

దౌల్తాబాద్: కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్ ధర తగ్గించడం పట్ల బీజేపీ నాయకులు హర్షం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు సతీష్ మాట్లాడారు. రక్షాబంధన్ సందర్భంగా ప్రధాని మోదీ సిలిండర్‌పై రూ.200 తగ్గించడం సతోషకరమని పేర్కొన్నారు. అలాగే ఉజ్వల కనెక్షన్ ఉన్నవారికి రూ.400 తగ్గించినట్లు తెలిపారు. బీజేపీ ప్రభుత్వం సబ్కా సాత్, సబ్కా వికాస్, సబ్కా విశ్వాస్ అనే నినాదంలో ముందుకు వెళ్తుందని వెల్లడించారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం



సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్

పెద్దేముల్: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే పల్లెలు అభివృద్ధి చెందుతున్నాయని సర్పంచ్ సువర్ణ, తట్టిపల్లి మాజీ ఎంపీటీసీ సభ్యుడు లక్ష్మణ్ అన్నారు. శుక్రవారం పెద్దేముల్ మండలం ఆత్కూర్ గ్రామంలో రూ.15లక్షలు ఎస్‌డీఎఫ్ నిధులతో సీసీరోడ్డు పనులను సర్పంచ్ ప్రారంభించారు. ఇందులో వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు శాంతప్ప, రవి, రాఘవేందర్, చందు పాల్గొన్నారు.

వరి తెగుళ్లపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న యమున

ధారూరు: వరి పంటకు సోకే తెగుళ్లపై తాండూర్ డాట్ సెంటర్ శాస్త్రవేత్త యమున రైతులకు అవగాహన కల్పించారు. గురుదోట్ల రైతువేదికలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో వరి సాగులో తీసుకోవలసిన చర్యలపై వివరించారు. ముఖ్యంగా వరిలో కలుపు నివారణ చర్యలు, ఎరువుల వాడకంపై ఆమె వెల్లడించారు. వరికి ఆశించే కాండం తొలుచు పురుగు, ఆకుచుట్ట పురుగు, సుడిదోమ, కంకినల్లి, అగ్గి తెగులు తదితర పురుగులు సోకుతాయని, వాటి నివారణ చర్యలు తీసుకోవాలని రైతులకు సూచించారు.

పేదలకు అండగా సీఎంఆర్ఎఫ్

దోమ: సీఎం సహాయనిధి పేదలకు అండగా నిలుస్తుందని జెడ్పీటీసీ నాగిరెడ్డి అన్నారు. దోమ మండలం ఐనాపూర్ గ్రామానికి చెందిన నిరుపేద మోబిన్ పాష కుమారుడు ఫజల్‌హైమద్ అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నారు. బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు రుక్మయ్యగౌడ్, కుల్కచర్ల ఏపీఓ వెంకటేశ్ ద్వారా విషయం తెలుసుకున్న జెడ్పీటీసీ నాగిరెడ్డి.. బాధిత కుటుంబానికి సీఎం సహాయనిధి కింద ఎమ్మెల్యే మహేశ్ రెడ్డి సహకారంతో రూ.1.50లక్షలు మంజూరు చేయించారు. ఈ మేరకు శుక్రవారం బాధిత కుటుంబానికి ఆ చెక్కును అందజేశారు.

ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి



ఎంఆర్‌సీ ఎదుట నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

పెద్దేముల్: సమగ్ర శిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న ఉద్యోగులను ప్రభుత్వం రెగ్యులర్ చేయాలని శుక్రవారం మండల వనరుల కేంద్రం(ఎంఆర్‌సీ) కార్యాలయం ఎదుట భోజన విరామ సమయంలో ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. 15 సంవత్సరాలుగా సమగ్ర శిక్ష అభియాన్‌లో పనిచేస్తున్నామని, చాలీచాలని జీతాలతో ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పనిచేస్తున్న తమను కూడా క్రమబద్ధీకరించాలని కోరారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

జ్ఞానోదయం కలిగించాలి

కొడంగల్ రూరల్: తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వానికి జ్ఞానోదయం కలిగించాలని అంబేడ్కర్ విగ్రహానికి సమగ్ర శిక్షా ఉద్యోగులు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడారు. ఏళ్లుగా విద్యాశాఖలో వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న తమను ప్రభుత్వం రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు.

బీఆర్ఎస్ ఎంపీటీసీ రాజీనామా



మహిపాల్‌రెడ్డి

దౌల్తాబాద్: అల్లాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ ఎంపీటీసీ, వైస్‌ఎంపీపీ బాయిరెడ్డి మహిపాల్‌రెడ్డి శుక్రవారం తన ఎంపీటీసీ పదవికి రాజీనామా చేశారు. ఈ సందర్భంగా రాజీనామా లేఖను ఎంపీడీఓ తిరుమలస్వామికి అందేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. వ్యక్తిగత కారణాల వలనే పదవికి రాజీనామా చేశానని, పార్టీలో సామాన్య కార్యకర్తగా పనిచేస్తానని వెల్లడించారు.

ఓటమి ఎరగని నేత

మహిపాల్‌రెడ్డి 20 సంవత్సరాల రాజకీయ ప్రస్థానంలో ఏనాడు ఓటమి ఎరగనినేతగా పేరుగాంచారు. టీడీపీ హయాంలో పార్టీ మండల అధ్యక్షుడిగా పనిచేస్తూనే సీటూరు, యాంకి ప్రాదేశిక స్థానాల్లో ఎంపీటీసీగా గెలిచారు. అనంతరం రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. అల్లాపూర్ ఎంపీటీసీగా గెలిచి వైస్‌ఎంపీపీగా ఎన్నికయ్యారు. ఓటు బ్యాంకు ఉండి ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి ప్రధాన అనుచరుడిగా ముద్ర ఉన్న మహిపాల్‌రెడ్డి.. పదవికి రాజీనామా చేయడం మండలంలో చర్చనీయాంశంగా మారింది. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌లో చేరతారా? అనే చర్చ జరుగుతోంది.

ఘనంగా వరలక్ష్మి వ్రతం



పూజలో పాల్గొన్న వారికి ప్రసాదంతో పాటు పూలమొక్కలను పంపిణీ చేస్తున్న వీరమణి

పరిగి: శ్రావణమాసాన్ని పురస్కరించుకొని శుక్రవారం పరిగి పట్టణంలో తెలంగాణ రాష్ట్ర వీరశైవ మహాసభ అధ్యక్షురాలు వీరమణి ఆధ్వర్యంలో వరలక్ష్మి వ్రతం, లలితచాలిసా కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులకు పూలమొక్కలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. సనాతన ధర్మాన్ని కాపాడుకోవాల్సి అవసరం ఎంతైనా ఉందని, అందులో భాగంగా ప్రతి ఒక్కరూ తమ పిల్లలకు ఆచార సంప్రదాయాలను వివరించాలని సూచించారు.

రాఘవేంద్ర స్వామి ఆరాధన ఉత్సవాలు



ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలోని శ్రీ రాఘవేంద్ర స్వామి ఆలయంలో ఆరాధన ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం ఉదయం 6 గంటలకు సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం చేశారు. అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. 11 గంటలకు గురుపూజ నిర్వహించి, పల్లకీ సేవ చేపట్టారు. మున్సిపల్ మాజీ చైర్మన్ విశ్వనాథం సత్యనారాయణ కుటుంబ సభ్యులు అన్నదానం చేశారు.

ఉరితాడుగా మారిన సీపీఎస్

'ప్రభుత్వాలకు 30ఏళ్లు ఊడిగం చేసి, ఉద్యోగ విరమణ పొందాక పింఛన్‌కు నోచుకోక, ఏ పనీ చేయలేక పిల్లల ఎదుట చులకనకు గురయ్యే ప్రమాదం ఉంది. సీపీఎస్‌ను రద్దు చేస్తూ పాత పింఛన్‌ను అమలు చేయాలి' అని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేశాయి. శుక్రవారం ఓపీఎస్ పునరుద్ధరించాలని కోరుతూ భోజన విరామ సమయంలో నిరసన వ్యక్తంచేశారు. అనంతరం తహసీల్దార్లకు వినతిపత్రం అందజేశారు.

- ఉద్యోగి కుటుంబానికి భద్రత కల్పించే ఓపీఎస్ అమలు చేయాలి
- ఉపాధ్యాయ సంఘాల డిమాండ్



దోమ: తహసీల్దార్ పురుషోత్తంకు వినతిపత్రం అందజేస్తున్న పీఆర్‌టీయూ సంఘం నేతలు

దోమ: సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్ విధానాన్ని అమలులోకి తేవాలని పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు కేశవులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో సంఘ సభ్యులతో కలిసి తహసీల్దార్ పురుషోత్తంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్రంలో అనేక మంది ఉపాధ్యాయులకు సీపీఎస్ విధానం ఉరితాడుగా మారిందని ఆరోపించారు. ప్రతి ఉద్యోగి కుటుంబానికి సామాజిక భద్రత కలిగిన పాత పింఛన్ విధానం తీసుకురావాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో తమ పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కృష్ణయ్య, నర్సింహులు, జిల్లా అసోసియెట్ అధ్యక్షుడు వేణుగోపాల్, మండల ప్రధానకార్యదర్శి ప్రభాకర్ రెడ్డి, పీఆర్‌టీయూ సంఘం సభ్యులు ప్రకాశ్, రాములు, శివ కుమార్, వీరానందం, నజీర్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాత పింఛన్ పునరుద్ధరించాలి

కొడంగల్ రూరల్: ఉద్యోగుల నెత్తిన రుద్దిన సీపీఎస్‌ను ప్రభుత్వం రద్దు చేసి, పాత పింఛన్‌ను పునరుద్ధరించాలని ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేణుగోపాల్ డిమాండ్ చేశారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్న పాఠశాలల ఆవరణలో పాత పెన్షన్‌ను అమలు చేయాలంటూ నిరసనలు వ్యక్తం చేశారు. రాష్ట్ర శాఖ పిలుపు మేరకు భోజన విరామ సమయంలో నిరసనలు వ్యక్తం చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. రిటైర్డ్ అయిన వారికి ఆసరా పింఛన్ కన్నా హీనంగా నెలకు రూ.5 వందలు లేదా రూ.850 నెలవారీ పింఛన్ చెల్లిస్తారని, ఇది ఉద్యోగికి చాలా అవమానకరమని పేర్కొన్నారు. ప్రభుత్వాలకు 30ఏళ్లు ఊడిగం చేసి, ఉద్యోగ విరమణ పొందాక పింఛన్‌కు నోచుకోక, ఏ పనీ చేయలేక పిల్లల ఎదుట చులకనకు గురయ్యే ప్రమాదం ఉందని, సీపీఎస్‌ను రద్దు చేస్తూ పాత పింఛన్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వెంకట్రాములు, రమేష్, తిరుమలేశ్, చలం బసంత్, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ విద్రోహ దినం

బొంరాస్‌పేట: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మండల ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి, పింఛన్ విద్రోహక దినం నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ వెంకటేశ్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ప్రభుత్వం సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పింఛన్ విధానం అమలు చేయాలని సంఘం ఎన్నిసార్లు కోరినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. దీనిపై ఉన్నతాధికారులకు విన్నవిస్తానని తహసీల్దార్ చెప్పారు. ఇందులో తపస్ మండల శాఖ అధ్యక్షుడు చంద్రశేఖర్, గౌరవ అధ్యక్షుడు వెంకటేశ్, కోశాధికారి సేవ్యానాయక్ సీఆర్‌పీ రాందాస్, సిబ్బంది గౌసుద్దీన్ తదితరులు ఉన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలి

పెద్దేముల్: సీపీఎస్‌ను రద్దుచేసి, పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. ఈ మేరకు డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. ప్రభుత్వం ఉద్యోగులకు ఆర్థిక భరోసా కల్పించాలని కోరారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల ప్రధాన కార్యదర్శి నవీన్, రాష్ట్ర, మండల బాధ్యులు అక్కమదేవి, వెంకటరెడ్డి, ద్యావరి నరేందర్‌రెడ్డి, గోబ్రా, బందెప్ప, రవికాంత్ రెడ్డి, శ్రీనివాస్, నర్సిరెడ్డి, సంఘమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



కొడంగల్ రూరల్: జెడ్పీహెచ్ఎస్(బి) ఎదుట నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు



బొంరాస్‌పేట: తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

దేశ గౌరవం పెంచిన మోదీ



ర్యాలీని నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

- మేరిమిట్టి మేరిదేశ్‌లో ప్రతి ఒక్కరూ పాలుపంచుకోవాలి: బీజేపీ నాయకులు
- అమృతవాటిక నిర్మాణానికి మట్టి సేకరించిన కమల నాథులు

కుల్కచర్ల: భారతదేశ గౌరవాన్ని మహోన్నత శిఖరాలకు తీసుకెళ్లిన ఘనత ప్రధాని నరేంద్ర మోదీకే దక్కుతుందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఘణపురం వెంకటయ్య అన్నారు. మేరిమిట్టి మేరీదేశ్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కుల్కచర్ల మండలం ఘనపూర్ గ్రామ వీధుల్లో ర్యాలీ నిర్వహించి ఆయన మాట్లాడారు. ఆజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా ప్రస్తుతం ఢిల్లీలో ఏర్పాటు చేస్తున్న అమృతవాటిక నిర్మాణంలో ప్రతీ గ్రామం నుంచి అమృతకలశం ద్వారా మట్టిని సేకరించడం జరుగుతుందని పేర్కొన్నారు. యువత ముందుకువచ్చి, పార్టీలకు అతీతంగా ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. ఇందులో బీజేపీ మండల అధ్యక్షుడు మైపాల్, స్థానిక సర్పంచ్ విజయలక్ష్మి, బీజేవైఎం మండల అధ్యక్షుడు మైపాల్, శేఖర్, హన్మంతు, వెంకటయ్య, ఆంజనేయులు, బాలకృష్ణారెడ్డి, మేకల హన్మంతు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

తాండూరులో..

తాండూరు: ఢిల్లీలో నిర్మిస్తున్న అమృత్ వాటిక నిర్మాణానికి తాండూరు నుంచి మట్టిని సేకరించి పంపిస్తామని మున్సిపల్ మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి అన్నారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ పిలుపు మేరకు మేరి మిట్టి, మేరాదేశ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పట్టణంలోని కాళికాదేవి ఆలయంలో అమ్మవారికి లక్ష్మారెడ్డితో పాటు పార్టీ నాయకులు పూజలు చేశారు. అనంతరం సుభాష్ నగర్‌లో ఇంటింటికీ వెళ్లి మట్టి సేకరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ బాలప్ప, పార్టీ నాయకులు మల్లేశ్ యాదవ్, ప్రహల్దాద్, పూజారి పాండు, రమ్యానాయక్, బీరప్ప, దోమకృష్ణ, మంతట్టి రాజు, సతీష్, చందు, ప్రకాష్, శివాజీ తదితరులు ఉన్నారు.

మేరిమిట్టి మేరిదేశ్..

పరిగి: దేశ కీర్తి ప్రతిష్టలను ప్రపంచ వ్యాప్తం చేసిన ప్రధాని మోదీ.. చేపట్టిన మరో మహోత్తరమైన కార్యక్రమం మేరిమిట్టి మేరిదేశ్‌లో ప్రతి ఒక్కరూ పాలుపంచుకోవాలని బీజేపీ సీనియర్ నాయకులు నందకుమార్, మాభూమి–మాదేశం జిల్లా కోఆర్డినేటర్ బాలకృష్ణారెడ్డి కోరారు. పరిగి పట్టణంలో మేరిమిట్టి మేరీదేశ్‌లో భాగంగా అమృతకలశం ద్వారా ప్రజల నుంచి చిటికెడు మట్టిని సేకరించారు. కార్యక్రమంలో నర్సింహులు, రమేష్, దోమ ఆంజనేయులు, రమేష్, కోళ్ల నర్సింహులు, శ్రీనివాస్, మహేందర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

మహనీయులను స్మరించుకుందాం

పూడూరు: దేశం కోసం పోరాడి అమరులైన మహనీయులను స్మరించుకోవాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశ్ పటేల్ అన్నారు. ప్రధాని మోదీ పిలుపు మేరకు 'మేరీమట్టి.. మేరీదేశ్' కార్యక్రమాన్ని రాకంచర్లలోని శ్రీ యోగానంద లక్ష్మీనర్సింహ్మస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. భారత స్వతంత్ర పోరాటంలో బ్రిటీష్ వారిని తరిమికొట్టే క్రమంలో ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారని గుర్తు చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అనీల్, ప్రభాకర్‌రెడ్డి, రాఘవేందర్, పరమానందాస్, శేఖర్, మల్లేశ్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.